# రెండు నెలల్లో సింగరేణి పట్టాల పంపిణీ

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు
- బీఆర్ఎస్ నుండి భారీగా చేరికలు.. కండవా కప్పి ఆహ్వానం
- అభివృద్ధి పనులకు 150 కోట్లతో ప్రతిపాదనలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

పట్టణంలోని పద్మనాయక హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు. ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ కొక్కిరాల సురేఖ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ... గత 75 ఏళ్లలో నియోజకవర్గాన్ని పాలించిన ఏడుగురు ఎమ్మెల్యేలు చేయని అభివృద్ధిని తాను చేసి చూపిస్తున్నానని చెప్పారు. సింగరేణి స్థలాల్లో నివసిస్తున్న కార్మిక కుటుంబాలకు మరో రెండు నెలల్లో శాశ్వత ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోనే ఎక్క డా లేని విధంగా మంచిర్యాలలో అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ సిస్టమ్ ను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని, నియోజకవర్గంలోని 282 పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించేందుకు 150 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు తాగునీరు, సాగునీరు, మౌలిక సదుపాయాల కోసం అనేక ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. ఐబీ చౌరస్తా వద్ద 600 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో 74.40 కోట్లతో నాలుగు మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 60 సీట్లు సాధించి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# చెన్నూర్ అభివృద్ధికి రూ. 50 కోట్లు:

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- చెన్నూర్ నుండి హైదరాబాద్‌కు నేరుగా బస్సు సౌకర్యం
- రూ. 1.20 కోట్లతో ఆధునిక శ్మశాన వాటిక నిర్మాణం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

చెన్నూర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రూ. 50 కోట్ల వ్యయంతో పనులు చేపట్టినట్లు రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి ఆయన పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 50 లక్షలతో మున్సిపాలిటీ ప్రవేశ ద్వారం వద్ద స్వాగత తోరణం (ఖమాన), రూ. కోటితో వివిధ వార్డుల్లో కల్వర్టులు, రూ. 50 లక్షలతో పార్కు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పట్టణ ప్రజల సౌకర్యార్థం ఒక ఎకరం విస్తీర్ణంలో రూ. 1.20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో స్మశాన వాటికను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహం సమీపంలో జిమ్, వాకింగ్ ట్రాక్‌తో కూడిన పార్కును రూ. కోటితో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల కోరిక మేరకు చెన్నూర్‌లో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే చెన్నూర్ నుండి హైదరాబాద్‌కు నేరుగా బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**విద్యా, వైద్య రంగానికి ప్రాధాన్యం..**

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ. 2 కోట్లు, జూనియర్ కళాశాలలో రూ. 1.50 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి 250 బోర్ వెల్స్ ఏర్పాటు చేశామని, అమృత్ పథకం పనులను వేగవంతం చేసి ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇస్తామని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 100 పడకల ఆసుపత్రి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... వివిధ నిధుల ద్వారా పట్టణాన్ని ఆధునీకరిస్తున్నామని, ఇప్పటికే 31 బోర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. మార్కెట్ ప్రాంతంలో నిర్మిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు తుది దశకు చేరుకున్నాయని, కోటపల్లి మండలంలోని ఆశ్రమ పాఠశాల ప్రారంభానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడిగా నారాయణ రెడ్డి

**శెనార్తి మీడియా, తలమడుగు :**

సర్పంచ్ ల సంఘం మండల కార్యవర్గాన్ని మండలంలోని 29 గ్రామపంచాయతీల సర్పంచ్ లు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా కజ్జర్ల సర్పంచ్ వెల్మ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రుయ్యాడి సర్పంచ్ రాకేష్, కోశాధికారిగా పల్లి (బి) సర్పంచ్ కట్కం సంజీవ్, ఉపాధ్యక్షులుగా తలమడుగు సర్పంచ్ చంటితోపాటు పలువురిని కార్యవర్గ సభ్యులు గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.. తన పై నమ్మకంతో మండల అధ్యక్షులుగా ఎన్నుకున్న సర్పంచ్ ల అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్ లు పాల్గొన్నారు.

# రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ



- మంచిర్యాలలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేతుల మీదుగా అందజేత
- 81 మంది రైతులకు రూ. 16.24 లక్షల రాయితీ
- ఆధునిక పరికరాలతో సాగు సులభతరం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

వ్యవసాయ సాగులో ఆధునిక పరికరాల వాడకంతో పనులు సులభతరం అవుతాయని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్హులైన రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారిణి సురేఖ, ఏఎంసీ చైర్మన్ పయ్యావుల పద్మముని, ఆత్మ బీఎఫ్ఏసీ చైర్మన్ సింగటి మురళితో కలిసి ఆయన ఈ పంపిణీలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... 2025-26 సంవత్సరానికి గాను అగ్రికల్చర్ మెకనైజేషన్ పథకంలో భాగంగా ప్రభుత్వం ఈ పరికరాలను అందిస్తోందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, బీమా వంటి పథకాలు అమలు చేయడంతో పాటు కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పిస్తున్నామని చెప్పారు. మొత్తం రూ. 35.31 లక్షల విలువైన 6 పవర్ టిల్లర్లు, 6 రోటవేటర్లు, 52 పవర్ స్ప్రేయర్లు, 16 బ్రష్ కట్టర్లను దండేపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల రైతులకు అందజేశారు. వీటికి ప్రభుత్వం రూ. 16.24 లక్షల రాయితీ కల్పించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కృష్ణ, మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు మరియు రైతులు పాల్గొన్నారు.



# బీసీ హామీలు అమలు చేయాలి

- సీఎంకు జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి పోస్ట్ కార్డులు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డులు పంపారు. మంచిర్యాల పట్టణ రైల్వే స్టేషన్ వద్ద గల పోస్ట్ ఆఫీస్ లో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు బీసీలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే చట్ట బద్ధతతో కూడిన మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని, సివిల్ కాంట్రాక్టులలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన మాటలను ప్రభుత్వం విస్మరించిందని నాయకులు విమర్శించారు. ఐదేళ్లలో బీసీ సంక్షేమానికి లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుతో పాటు జిల్లా కేంద్రాల్లో 50 కోట్లతో బీసీ భవనాల నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే ఉన్నత విద్య కోసం విద్యార్థులకు పూచీకత్తు లేని పది లక్షల రుణాల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టడం, స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరించడం వంటి హామీలపై స్పష్టత లేకపోవడం బీసీ సమాజాన్ని మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హామీలను అమలు చేయకుంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజ్జల్లి వెంకటయ్య, సదానందం, రామగిరి రాజన్న చారి, చెలిమెల అంజన్న, వేముల అశోక్, కీర్తి బిక్షపతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ప్రాంగణంలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఓటు అత్యంత శక్తివంతమైన వజ్రాయుధమని, 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలని, సమాజాన్ని చైతన్యపరచడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని కోరా రు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం. కుమార స్వామి, డాక్టర్ కె. రాజయ్య, ఎన్సీసీ ఆఫీసర్ జే. మహేష్ కుమార్, డాక్టర్ టీ. గంగయ్య, ఎం. కనక లక్షి మరియు ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# చంద్రవెల్లిలో రాయితీపై వేప నూనె పంపిణీ




**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

జాతీయ ఆహార భద్రత పథకం (NFSM)లో భాగంగా మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో రైతులకు రాయితీపై వేప నూనెను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ చిలుముల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గజ్జెల్లి రాజ్ కుమార్ చేతుల మీదుగా రైతులకు ఈ పురుగుమందులను అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ... రైతులు రసాయన పురుగుమందుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతులపై మొగ్గు చూపాలని కోరారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పర్యావరణానికి హాని కలగకుండా నాణ్యమైన దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం 33 శాతం రాయితీపై బెల్లంపల్లి మండలానికి మొత్తం 150 లీటర్ల వేప నూనెను మంజూరు చేసిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేప నూనె వాడకం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా పంటలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ తిరుపతి, వార్డు సభ్యులు, ఐకేపీ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్ రికవరీ

- బాధిత మహిళకు సెల్‌ఫోన్ అందజేసిన భీమారం ఎస్సై
- రూ. 27 వేల విలువైన ఫోన్‌ను గుర్తించిన పోలీసులు

**శెనార్తి మీడియా, మంచిర్యాల (భీమారం):**




పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను వెతకడంలో కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ (CEIR) పోర్టల్ ఎంతో కీలకంగా మారుతోంది. ఈ పోర్టల్ సహాయంతో పది రోజుల క్రితం పోగొట్టుకున్న రూ. 27 వేల విలువైన సెల్‌ఫోన్‌ను భీమారం పోలీసులు గుర్తించి బాధితురాలికి అందజేశారు. భీమారం గ్రామానికి చెందిన కాలువ లక్షి తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై ఏ. రాజేందర్ ఆధ్వర్యంలో సీఈఐఆర్ పోర్టల్‌లో ఆ ఫోన్ వివరాలను నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఫోన్ ఎక్కడ ఉందో గుర్తించిన పోలీసులు, దానిని స్వాధీనం చేసుకుని శనివారం బాధితురాలు లక్షి కి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేందర్ మాట్లాడుతూ ఫోన్లు పోగొట్టేకున్న వారు వెంటనే పోలీసులను సంప్రదించి సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. పోగొట్టుకున్న ఫోన్ తిరిగి రావడంతో బాధిత మహిళ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- నస్పూర్ కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం
- బాలికా రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు
- ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు జ్ఞాపికల అందజేత

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, విద్యాశాఖ అధికారి యాదయ్యతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'బాలికలను రక్షిద్దాం - బాలికలను చదివిద్దాం' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. భ్రూణ హత్యల నివారణ, బాల్య వివాహాల నియంత్రణ ద్వారా బాలికల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బేటీ బచావో - బేటీ పడావో ద్వారా జిల్లాలో ఆడపిల్లల లింగ నిష్పత్తిని పెంచగలిగామని వివరించారు. కేజీబీవీల ద్వారా బాలికా విద్యను ప్రోత్సహిస్తూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా చేయూతనిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ... బాలికలు సమాజంలో జరుగుతున్న అంశాలపై అవగాహన పెంచుకోవాలని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం జాతీయ బాలికల దినోత్సవ గోడ ప్రతులను ఆవిష్కరించి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. చదువు, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన బాలికలకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు కిషన్, దుర్గాప్రసాద్, శంకర్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రశాంతంగా రంజాన్ జరుపుకోవాలి:**

రంజాన్ పండుగను మత సామరస్యంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ముస్లిం మత పెద్దలు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మసీదుల వద్ద తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్ రావు, ఏసీపీ ప్రకాష్, మైనారిటీ సంక్షేమ అధికారి రాజేశ్వరి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

